సాక్షి మెదక్

గురువారం । 16 । అక్టోబర్ । 2025



ఎవరిది ఈ 'చెత్త' ఐడియా..!

చెత్త సేకరణ ప్రక్రియకు సంబంధించి ఖర్చంతా భరిస్తున్న హుస్నాబాద్ మున్సిపాలిటీకి నయా పైసా ప్రయోజనం చేకూరడం లేదు.

వివరాలు 10లో ▸



ఎస్‌జీఎఫ్ క్రీడా సంబురం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు పటాన్‌చెరు మైత్రి మైదానం వేదికగా నిలవబోతోంది.

వివరాలు 10లో ▸



విధులకు మళ్లీ డుమ్మా!

రెండేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై వెళ్లిన టీచర్ ఇటీవలే విధుల్లో చేరారు. వెంటనే మళ్లీ వారం పాటు సెలవులో వెళ్లినట్లు తెలుస్తోంది.

వివరాలు 11లో ▸

టికెట్ నాకే.. ఎమ్మెల్యే నేనే

గులాబీ దళంలో పెరిగిన కంఠ స్వరం

- పద్మక్క కలవరం
- ముదిరిపాకాన పడుతున్న వర్గపోరు

మెదక్ అర్బన్: 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం నేనే ఎమ్మెల్యే. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుపై నమ్మకం ఉంది. పార్టీ టికెట్ ఎలాగైనా ఇస్తా రు. అమ్మవారి దయతో 2029 ఎన్నికల్లో నిజాంపేట బిడ్డగా.. ఎమ్మెల్యేగా మీ ముందుకొస్తానంటూ..' నిజాంపేటలో ఆదివారం జరిగిన 'కాంగ్రెస్ బాకీ కార్డు' పంపిణీ కార్యక్రమంలో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి చేసిన వ్యాఖ్యలు గులాబీ దళంలో కాక రేపుతున్నాయి. మెతుకుసీమ రాజకీయాల్లో ఉద్యమ నేతగా పేరొందిన పద్మక్క.. ద్వితీయ శ్రేణి నాయకుడి ధిక్కార స్వరంతో కలవరపడుతోంది. ఇంతకాలం నివురుగప్పిన నిప్పు లా ఉన్న ఆశలు.. ఒక్కసారిగా భగ్గుమనడంతో బీ ఆర్ఎస్‌లో అలజడి మొదలైంది. అయితే ఈ వ్యా ఖ్యల పరిణామాలను ట్రబుల్ షూటర్ నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

అప్పుడు నెయ్యం.. ఇప్పుడు కయ్యం

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ టికెట్ తనదేనన్న ధీమాతో ఉన్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి మైనంపల్లి రోహిత్‌రావు రూపంలో పార్టీ షాకిచ్చింది. అనూహ్య పరిణామంతో తీవ్ర ఆందోళనకులోనైన కంఠారెడ్డి డీసీసీ పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. మోసం చేసిన కాంగ్రెస్‌పై ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో హస్తం పార్టీలో ఉన్న తనవర్గాన్ని బీఆర్ఎస్‌లోకి తిప్పుకోవడానికి పడరాని పాట్లు పడ్డారు. కొంతమేర కృతకృత్యుడయ్యాడు. అప్పట్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారెడ్డి విజయం కోసం కృషి చేశారు. కాలం గడుస్తున్నా కొద్దీ బీఆర్ఎస్‌లో కొంతమందిని తన వైపు తిప్పుకున్నాడు. విందులు, వినోదాలతో మరికొంత మందిని ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా గత ఎన్నికల అనంతరం మాజీ ఎమ్మెల్యే కొంతకాలం నియో జకవర్గానికి దూరంగా ఉన్న సమయాన్ని వినియోగించుకొని కొంతమేర పట్టు పెంచుకున్నాడు. ఆర్థిక సహాయాలు, ప్రజోపయోగ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీలో పరపతిని పెంచుకున్నాడు.

మెతుకుసీమ బీఆర్ఎస్‌లో వర్గపోరు కొనసాగుతోంది. తాజాగా కంఠారెడ్డి తిరుపతి రెడ్డి వ్యాఖ్యలతో అలజడి మొదలైంది. ఈ పరిణామాలను పార్టీ నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



ముందుగానే పసిగట్టిన పద్మారెడ్డి

మెతుకుసీమ రాజకీయాల్లో ఎదురులేని ఏలికగా నిలిచిన బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మారెడ్డి, పార్టీలో ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ముందుగానే పసి గట్టారు. ఎమ్మెల్యే పదవిపై ఆశలు పెంచుకుంటున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కదలికలపై కన్నేసి, కౌంటర్ చర్యలు ప్రారంభించారు. పైకి సఖ్యతగా ఉన్నట్లు కనిపించినా, కంఠారెడ్డితో కలిసి ఉన్న సందర్భాల్లో పద్మారెడ్డి అసౌకర్యంగానే ఉన్నట్లు కనిపించేవారని కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ తిరుపతిరెడ్డి తన స్వస్థలమైన నిజాంపేటలో చేసిన వ్యాఖ్యలు పార్టీలో నెలకొన్న వర్గ విభేదాలను ప్రస్ఫుటం చేసేవిగా ఉండటంతో.. రెండు, మూడు రోజుల్లో మాజీ మంత్రి బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించి, సమస్యను పరిష్కరించే అవకాశం ఉందని పాపన్నపేటకు చెందిన బీఆర్ఎస్ ముఖ్యనాయకుడు ఒకరు తెలిపారు.

న్యూస్‌రీల్

సేవాభావం అలవర్చుకోవాలి

ఏఎస్పీ మహేందర్



మాట్లాడుతున్న ఏఎస్పీ మహేందర్

హవేళిఘణాపూర్(మెదక్): చదువుతో పాటు సేవాభావం పెంపొందించుకోవాలని ఏఎస్పీ మహేందర్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని ముత్తాయికోటలో జరిగిన ఎన్ఎస్ఎస్ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను కూడా ఎన్ఎస్ఎస్ వలంటీర్‌నేనని, కష్టపడే అలవాటు అప్పటి నుంచే ఏర్పడిందన్నారు. రాబోయే రోజుల్లో మంచి ఉద్యోగావకాశాలు పొంది ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ చైర్మన్, ప్రిన్సిపాల్ హుస్సేన్, పంచాయతీ సెక్రటరీ హేమంత్, కిరణ్‌గౌడ్, రఘుబాబు, ప్రోగ్రాం ఆఫీసర్ మురళి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌సీఓ గౌతంకుమార్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఉమ్మడి మెదక్ జిల్లా ఎంజేపీ బీసీ గురుకుల సొసైటీ ఆర్‌సీఓ గౌతంకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో అండర్-17 కబడ్డీలో పరుశురాం, వాలీబాల్‌లో హేమంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అభినందించారు. ఈసందర్భంగా ఆర్‌సీఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హరిబాబు, పీడీ అంజలి, పీఈటీలు కార్తీక్, శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా కౌడిపల్లిలోని ఎస్టీ గురుకుల పాఠశాలకు చెందిన సిద్దార్థ్ అండర్- 14 ట్రిపుల్ జంప్‌లో ప్రథమస్థానం, ఇంటర్ విద్యార్థి నరేందర్ నాయక్ షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.


అనుమానితులు కన్పిస్తే సమాచారం ఇవ్వాలి



యువకులతో మాట్లాడుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

నర్సాపూర్: అనుమానితులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ ప్రజలను కోరారు. బుధవారం ఉదయం పట్టణంలోని చైతన్యపురి కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దని హితవు పలికారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కాగా సరైన డాక్యుమెంట్లు లేని 59 ద్విచక్ర వాహనాలు, ఏడు ఆటోలను స్వాధీనం చేసుకున్నామని సీఐ జాన్‌రెడ్డి చెప్పారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు అందజేస్తే అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ రంగకృష్ణ, వెంకటరాజాగౌడ్, ఎస్ఐ రంజిత్‌రెడ్డితో పాటు ఏడుగురు ఎస్ఐలు సుమారు వంద మంది పోలీసులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వేళాయె



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధి చెందిన ఏడుపాయల దుర్గమ్మ ఆలయం భక్తుల దర్శనానికి ముస్తాబవుతోంది. 60 రోజులుగా మంజీరా వరదల్లో మునిగిన ఆలయాన్ని సిబ్బంది శుభ్రం చేశారు. లక్షలాది క్యూసెక్కుల ప్రవాహంతో ఆలయం పూర్తిగా దెబ్బతింది. క్యూలైన్లు, రేకులు, ఫ్లోరింగ్, గ్రానైట్ దెబ్బతిన్నాయి. లడ్డు ప్రసాదం కౌంటర్ కొట్టుకుపోయింది. సుమారు రూ. కోటిన్నర నష్టం వాటిల్లినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఆలయాన్ని సిబ్బంది శుభ్రం చేశారు. కాగా విద్యుత్ సరఫరా ఇంకా పునరుద్ధరించలేదు. రెండు రోజుల్లో దర్శనాలు ప్రారంభం కావొచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

అక్రమ నిర్మాణాలపై కొరడా

- నిబంధనలు అతిక్రమించిన కట్టడాల కూల్చివేత
- మాస్టర్‌ప్లాన్ అమలులో భాగంగా కఠిన నిర్ణయాలు
- అక్రమ నిర్మాణాలంటేనే జంకుతున్న వైనం

మెదక్ బల్దియా అధికారులు మాస్టర్‌ప్లాన్‌ను పక్కాగా అమలు చేస్తున్నారు. ఇటీవల నిబంధనలు అతిక్రమించి నిర్మించిన రెండు భవనాలను కూల్చివేశారు. అందులో ఓ భవనం గ్రీన్‌జోన్ పరిధిలో ఉండగా, మరో భవనం అనుమతిని మించి నిర్మించడంతో కఠినంగా వ్యవహరించారు. ఈ రెండు సంఘటనలతో మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించాలంటేనే పలువురు జంకుతున్నారు. – మెదక్‌జోన్

మెదక్ మున్సిపాలిటీ 1952లో ఆవిర్భవించింది. 18 వేల పైచిలుకు ఇళ్లు ఉండగా, సుమారు 80 వేల మంది ఇక్కడ నివసిస్తున్నారు. జనాభాతో పోటీపడి పట్టణ విస్తీర్ణం రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో 1992లో దీనికి మాస్టర్‌ప్లాన్ అమలు చేయగా, ఇది అమల్లోకి వచ్చి 33 ఏళ్లు అవుతోంది. అయితే దీనిని ఇప్పటివరకు పక్కాగా అమలు చేసిన దాఖలాలు లేవు. దీంతో పట్టణంలో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు కొనసాగించారు. అయినా అడ్డుచెప్పిన వారు లేరు. దీంతో అనేక రకాలుగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనట్లు పలువురు బహిరంగంగానే విమర్శిస్తుంటారు. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా పట్టణం అంతా జలమయంగా మారుతోంది.

ఇటీవల రెండు భవనాల కూల్చివేత

పట్టణంలో ఇటీవల అక్రమంగా నిర్మించిన రెండు భవనాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. మిలటరీ కాలనీలో రోడ్డు పక్కన జీప్లస్ వన్ నిర్మాణం కోసం స్లాబువేశాడు. కాగా గ్రీన్‌జోన్‌లో ఇళ్లు నిర్మించటం నిషేధమని అధికారులు గుర్తించి నిర్మాణాన్ని నిలిపి వేయించారు. అలాగే అజంపుర ప్రాంతంలో గల ఏదులచెరువుకు సంబంధించి కొంత స్థలం ఉండగా, అందులో మహిళా జూనియర్ కళాశాలతో పాటు షాదీఖానాను ప్రభుత్వం నిర్మించింది. గతంలో పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇల్లు కూల్చివేయగా, అతడికి ఏదుల చెరువులో కొంత స్థలం కేటాయించారు. సదరు వ్యక్తి ఆ స్థలాన్ని ఇతరులకు విక్రయించాడు. దానిని కొనుగోలు చేసిన వ్యక్తి ఇటీవల ఆ ప్రదేశంలో షాపింగ్ (కమర్షియల్) భవనాన్ని నిర్మించాడు. కాగా కేటాయించిన దాని కన్నా ఎక్కువ స్థలంలో నిర్మించాడని గుర్తించిన అధికారులు కొంతభాగాన్ని కూల్చివేశారు. ఈ రెండు సంఘటనలతో మెదక్ బల్దియాలో అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించాలంటేనే పలువురు జంకుతున్నారు. అన్నిరకాల అనుమతులు ఉంటే తప్ప ఇళ్ల నిర్మాణాల జోలికి వెళ్లటం లేదు.



అజంపురలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేసిన అధికారులు

అనుమతులు తప్పనిసరి

పట్టణంలో ఇళ్లు నిర్మించాలంటే మాస్టర్ ప్లాన్‌కు లోబడి నిర్మాణాలు చేపట్టాలి. అన్ని రకాల అనుమతులు ఉంటేనే అనుమతులు ఇస్తాం. ఇష్టానుసారంగా నిర్మాణాలు చేప డితే కూల్చివేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

పాత వాటికి.. కొత్త పూత

- మొబైల్ వ్యాపారి మాయజాలం
- ఆఫర్లతో ఆకట్టుకుంటున్న వైనం
- వేలంలో తక్కువకు కొని ఎక్కువ ధరకు అమ్మకాలు

మెదక్ పట్టణంలోని ఓ మొబైల్ షాపులో ఇటీవల ఓ వ్యక్తి ఐఫోన్ కొనుగోలు చేశాడు. షాపు యజమాని కొత్త ఫోన్ అని చెప్పి విక్రయించాడు. కొనుగోలుదారుడు సెల్‌ఫోన్ ఓపెన్ చేసి మెయిల్ ఐడీ క్రియేట్ చేసే ప్రయత్నం చేయగా.. అందులో ఇప్పటికే కొన్ని ఐడీలు క్రియేట్ చేసి ఉన్నాయి. దీంతో ఐఎంఏ నంబర్‌తో సంబంధిత ఐఫోన్ ఎప్పుడు యాక్టివ్‌లోకి వచ్చిందని పరిశీలించాడు. ఆ ఫోన్ రెండేళ్ల క్రితమే యాక్టివేట్ అయినట్లు గుర్తించాడు. దీంతో వెంటనే షాపు యజమాని వద్దకు వచ్చి నిలదీయడంతో దానిని రిటర్న్ తీసుకొని, అంతకంటే విలువైన మరో సెల్‌ఫోన్‌ను ఇచ్చినట్లు తెలిసింది.

అదేషాపులో మరో వ్యక్తి సెల్‌ఫోన్ కొనుగోలు చేయగా, 4 రోజుల్లోనే డెడ్ అయ్యింది. దీంతో అతడు కస్టమర్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లగా.. ఆ ఫోన్ ఇప్పటికే వాడి ఉండటంతో దాని వారంటీ గడువు తీరిందని చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు ఆ వ్యాపారి వద్దకు వచ్చి గొడవ చేశాడు. అయితే అతడు కొనుగోలు చేసిన దానికంటే విలువైన మరో సెల్‌ఫోన్ అందజేసినట్లు తెలిసింది.



మెదక్ మున్సిపాలిటీ: నేటి సమాజంలో మొబైల్ వాడకం ప్రతి మనిషికి తప్పనిసరిగా మారింది. ఇదే అదునుగా భావించిన జిల్లా కేంద్రంలోని ఓ మొబైల్‌షాపు నిర్వాహకుడు సాంకేతిక సమస్యలు, సెకండ్ హ్యాండ్ ఫోన్లకు కొత్త పూతలు పూసి నయా ఫోన్లు అంటూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. తన దుకాణంలో జీరో డౌన్ పేమెంట్ అంటూ, ఆన్‌లైన్ కంటే తక్కువ ధరకే ఇస్తున్నామని ఆశ పెడుతున్నాడు. అలాగే ఫోన్లు కొనుగోలు చేసిన వారికి వాషింగ్ మిషన్లు, ఎలక్ట్రిక్ స్కూటీలు, ఫ్రిజ్‌లతో పాటు ప్రతి సెల్‌ఫోన్ కొనుగోలుపై ఆసక్తికరమైన పది గిఫ్టులు అంటూ.. కస్టమర్లకు గాలం వేస్తున్నాడు. ఇలా ప్రతిరోజూ రూ. లక్షల్లో వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. అలాగే నెట్టింటా వైరల్ అయ్యే ఇన్‌స్టాగ్రామ్‌లో పెద్ద ఎత్తున ప్రచారాలు కొనసాగిస్తున్నాడు. షేర్‌చేస్తే ఒక గిఫ్ట్, లైక్ కొడితే మరో గిఫ్ట్, కామెంట్ చేస్తే ఇంకో గిఫ్ట్ ఇలా.. సాంకేతికతను వాడుకుంటూ రూ. కోట్లలో వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది.

అసలు రహస్యం ఇదే..

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థలు తమ ప్లాట్‌ఫాంలలో పెద్దఎత్తున ఆఫర్లతో సెల్‌ఫోన్‌లు విక్రయిస్తుంటాయి. వాటిని కొనుగోలు చేసిన వినియోగదారులు, సాంకేతిక సమస్యలు వచ్చిన వాటిని రిటర్న్ చేస్తుంటారు. అయితే వాటిని ఆ కంపెనీలు రిపేర్ చేయించి ముంబై, ఢిల్లీ వంటి పెద్ద పెద్ద నగరాల్లో లాట్‌ల రూపంలో వేలం వేస్తుంటాయి. ఈ వేలంలో రూ. లక్షల విలువైన సెల్‌ఫోన్లను రూ. వేలల్లో విక్రయిస్తుంటాయి. మెదక్‌కు చెందిన వ్యాపారి అలాంటి సెల్‌ఫోన్లను లాట్‌ల రూపంలో కొనుగోలు చేసి, కొత్తవాటి ధరలకు విక్రయిస్తున్నాడు. ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలు, విచ్చలవిడిగా గిఫ్టులు ఇస్తూ అమాయక ప్రజలకు అంటగడుతున్నట్లు తెలిసింది.

పోషకాహార లోపాన్ని నివారిద్దాం

డీడబ్ల్యూఓ హేమభార్గవి

రామాయంపేట(మెదక్): మెదక్‌ను పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని డీడబ్ల్యూఓ హేమభార్గవి అన్నారు. ఐడీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణమాస వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల విషయమై బాలికలు, వారి తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. పోషణలోపం, బాల్య వివాహాలను అరికట్టడానికి ముందుకెళ్తున్నామని వివరించారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే స్థానికంగా లభ్యమవుతున్న పండ్లు, ఆకుకూరలను తినాలని సూచించారు. ముఖ్యంగా ఆకుకూరలతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, వీటిలో పోషణ విలువలు అధికంగా ఉంటాయని వివరించారు. పోషణ వారోత్సవాలకు సంబంధించి గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీడీపీఓ స్వరూప, పలు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హేమభార్గవి

మద్యం దుకాణాలకు 276 దరఖాస్తులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని 49 మద్యం దుకాణాలకు ఇటీవల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా, మొత్తం 276 వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు ముందుగానే వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

నారాయణఖేడ్: ఖేడ్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, వసతిగృహాన్ని స్థానిక సబ్ కలెక్టర్ ఉమాహారతి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యాబోధన, భోజనం నాణ్యత విషయాల గురించి విద్యార్థులను ఆరా తీశారు. వసతిగృహంలో సమస్యలు, అవసరాలను గురించి వసతిగృహం సంక్షేమ అధికారిణి బాలమణిని అడిగి తెలుసుకున్నారు.

రిజర్వేషన్ల అమలుకు పోరాడుదాం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం

రామాయంపేట(మెదక్)): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మెట్టు గంగారాం అన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాము ఏ కులానికి వ్యతిరేకం కాదని, తమకు అన్యాయం తలపెట్టిన వారికి వ్యతిరేకంగా పోరాడుతామని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని, వారి ఆటలు సాగబోవన్నారు. ఈనెల 18న నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెదక్ బీసీ జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్, కోశాధికారి దామోదర్, ప్రధాన కార్యదర్శి భూమ కిషన్, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సిద్దరాంలు, మండలాధ్యక్షుడు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం సభ్యులు

గాలికుంటు నివారణకు టీకాలు



పెద్దచింతకుంటలో పశువులకు టీకాలు వేస్తున్న అధికారులు

నర్సాపూర్ డివిజన్ పశువైద్యాధికారి జనార్దన్

నర్సాపూర్ రూరల్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని నర్సాపూర్ డివిజన్ పశువైద్యాధికారి జనార్దన్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కొండాపూర్, పెద్ద చింతకుంటతో పాటు నర్సాపూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. మూడు గ్రామాల్లో కలిపి 186 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. ప్రతి ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేయించాలన్నారు. ఇందుకోసం అన్ని గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు పశు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సౌమిత్ కుమార్, స్వప్న, ఆంజనేయులు, వీరేశం, వెంకటేశ్, ఏసుప్రభు పాల్గొన్నారు.

సింగూరులో జలవిద్యుత్ ఉత్పత్తి

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతోంది. దీంతో క్రస్టు గేట్లు మూసివేసి జలవిద్యుత్ కేంద్రం ద్వారా రోజుకు 2,500 క్యూసెక్కుల నీటితో రెండు టర్బయిన్లను ఆన్ చేసి 0.5 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.



గంజాయి సాగు చేస్తే పథకాలు కట్

- డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం
- అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: గంజాయి సాగు చేసే రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వెంటనే నిలిపివేస్తామని, జిల్లాలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో డ్రగ్స్ వ్యతిరేక కమిటీలు వేయాలని ఆదేశించారు. గంజాయి సాగు చేస్తే జరిగే పరిణామాలపై రైతులకు వివరించాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ డీవీ మాట్లాడుతూ.. దాబాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి పరిశ్రమలకు ఉపాధి కోసం వచ్చే వారిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్లు గుర్తించి ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే చోట సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

జిల్లాలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో కనీస మౌలిక వసతులతో పాటు సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమశాతం కొలిచే యంత్రాలు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ఇదే విషయమై మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమకుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం బాల్య వివాహాల నివారణ గోడ పత్రికను ఆవిష్కరించారు. అలాగే చేయూత పథకంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ పింఛన్లకు గల అర్హతలను వాటి విధి విధానాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కూటీలో నుంచి నగదు చోరీ

జహీరాబాద్ టౌన్: పట్ట పగలే గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీలో నుంచి నగదు అపహరించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన అంజయ్య ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి మంగళవారం రూ.3.17 లక్షలు డబ్బు డ్రా చేసుకుని బయట పార్కింగ్ చేసిన స్కూటీ డిక్కీలో పెట్టి మళ్లీ లోపలికి వెళ్లి వచ్చారు. బ్యాంక్ పని పూర్తయ్యాక స్కూటీ డిక్కీ తెరిచి ఉండడంతో అందులోని నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించారు. బాధితుడు జహీరాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వినయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమాన

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా న్యాయస్థానం జరిమాన విధించింది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ.. ముగ్గురికి రూ.1,500, మిగతా ఐదు మందికి రూ.1,000, చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండలంలోని నందిగామ శివారులో బుధవారం ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, ఫారెస్ట్ ఆఫీసర్ మహేశ్ బైక్‌పై రామాయంపేట నుంచి నిజాంపేటకు వస్తున్న క్రమంలో ఆటో ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు ఆవుల అపహరణ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఫత్తేపూర్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఆవులు అపహరించారు. గ్రామానికి చెందిన హన్మంత్, గాంద్ల పండరికు చెందిన పశువులను ఇంటి ఎదుట కట్టేశారు. ఉదయం చూసేసరికి ఆవులు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీట మునిగి వ్యక్తి మృతి

మంజీరాలో మోటారు తీస్తుండగా ప్రమాదం


ఆబిద్

పాపన్నపేట(మెదక్): మంజీరా నదిలో విద్యుత్ మోటారును తీసేందుకు వెళ్లి నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కుర్తివాడలో బుధవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆబిద్ (53) వ్యవసాయంతో పాటు, ఆటో నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంజీరా నది దగ్గర ఉన్న తన పొలానికి ,నీరందించే విద్యుత్ మోటారు పైప్‌లైన్ ఊడిపోయింది. దాన్ని బిగించేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. బుధవారం ఉదయం అతని మృతదేహం దొరికింది. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


మేఘన (ఫైల్)

కొండపాక(గజ్వేల్): విద్యార్థిని మల్లం మేఘన(14) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం కుకునూరుపల్లికి చెందిన మేఘన రోజూ లాగానే 6వ తేదీన పాఠశాలకు వెళ్లింది. అయితే సర్టిఫికెట్ మర్చిపోవడంతో స్నేహితులతో కలిసి ఇంటికి వచ్చింది. తిరిగి పాఠశాలకు వెళ్తున్న క్రమంలో రాజీవ్ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ వైపు బుల్లెట్‌పై వెళ్తున్న కోతి అనిల్ ఢీ కొట్టాడు. దీంతో తలకు గాయాలై కోమాలోకి వెళ్లింది. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమె తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కోహెడ మండలంలోని తీగలకుంటపల్లికి చెందిన అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన అక్కన్నపేట మండలం కుందనవానిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెల్దండి సంపత్‌రాజు ఆర్టీసీ డ్రైవర్. రోజు మాదిరిగానే డ్యూటీకి తన ద్విచక్రవాహనంపై హుస్నాబాద్‌కు వెళుతున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో సంపత్‌రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్ సహాయంతో హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎవరిది ఈ చెత్త ఐడియా..!

సొమ్ము ఒకరిదైతే.. సోకు మరొకరిది అన్నట్లుంది హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిస్థితి. కష్టం కార్మికులకుదైతే.. కాసులు మాత్రం ప్రైవేట్ ఏజెన్సీ జేబుల్లోకి వెళుతున్నాయి. చెత్త సేకరణ ప్రక్రియకు సంబంధించి ఖర్చంతా భరిస్తున్న మున్సిపాలిటీకి నయా పైసా ప్రయోజనం చేకూరడం లేదు. ఈ 'చెత్త'ఐడియా మున్సిపల్ అధికారులకు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని పట్టణ ప్రజలు విస్మయం చెందారు.

- చెత్త సేకరించేది మున్సిపల్ కార్మికులు అమ్ముకునేది ప్రైవేట్ ఏజెన్సీయా..?
- ఖర్చంతా మున్సిపాలిటీదైనా నయా పైసా లాభం లేదు
- ఒప్పందం వెనుక ఆంతర్యమేమిటో..!
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ


చెత్తను వాహనాల్లో తీసుకెళుతున్న పారిశుద్ధ్య కార్మికులు

హుస్నాబాద్: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు నిత్యం ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తారు. తడి చెత్తను వేరు చేసి అక్కడే సేంద్రియ ఎరువుగా మారుస్తుంటే.. పొడి చెత్తను ఓ స్వచ్ఛంద సంస్థ సొమ్ము చేసుకుంటోంది. తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మున్సిపల్ అధికారులు, బసిల్ ఫౌండేషన్ తెలంగాణ స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. హుస్నాబాద్ పట్టణంలో ప్రతి రోజు 10 ఆటోలు, ఒక ట్రాక్టర్ ద్వారా పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరిస్తున్నారు. మొత్తం 26 మంది కార్మికులు పని చేస్తున్నారు. ప్రతి నెల 195 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో 20 టన్నుల పొడి చెత్తను వేరు చేసి, మిగతా తడి చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేస్తున్నారు. పొడి చెత్తను అమ్ముకునేందుకు మహిళా సంఘాలకు అప్పగించాల్సి ఉండగా, ఐదేళ్ల వరకు బసిల్ ఫౌండేషన్‌కు అప్పగించారు.

ఒప్పందం వెనుక ఆంతర్యమేమిటో!

ప్రతి రోజు ఇళ్ల నుంచి చెత్త సేకరణకు వినియోగించే ఆటోలు, ట్రాక్టర్, అందులో పోసే డీజిల్ ఖర్చంతా మున్సిపాలిటీదే. చెత్తను సేకరించి డీఆర్‌సీసీ సెంటర్‌కు తరలించేది మున్సిపల్ కార్మికులు. చెత్తను నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసిన షెడ్డు మున్సిపల్‌దే. వాహనాలు, వాటి మరమ్మతుల ఖర్చులన్ని మున్సిపల్‌వే. అలాంటప్పుడు పొడి చెత్త ద్వారా వచ్చే ఆదాయంలో మున్సిపాలిటీకి నయా పైసా రావడంలేదు. గంపగుత్తగా అమ్ముకోవడానికి చేసుకున్న ఒప్పందం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పొడి చెత్త నుంచి వచ్చే ఆదాయంలో కనీసం 30 శాతం మున్సిపల్‌కు చెల్లించాల్సి ఉంటుంది. పొడి చెత్తలో వచ్చే ప్లాస్టిక్ వస్తువులు, ఖాళీ సీసాలు, అట్టలు ఇలా వచ్చిన వస్తువులకు గాను కిలో కొంత కార్మికులకు ఇన్‌సెంటివ్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే వార్డుల వారీగా తడి, పొడి చెత్త విభజనపై సంస్థ నిర్వాహకులు ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉన్నా ఎక్కడా అలాంటి దాఖలాలు లేవు.

టెండర్ ప్రక్రియను ప్రారంభిస్తాం



తడి, పొడి చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బసిల్ ఏజెన్సీకి అప్పగించాం. చెత్త విభజనపై కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం. పొడి చెత్త అమ్మకంపై వచ్చే ఆదాయం నుంచి మున్సిపల్‌కు కొంత డబ్బు రావాల్సి ఉంటుంది. ఏజెన్సీ మాత్రం మున్సిపల్‌కు డబ్బులు ఇవ్వడం లేదు. ఇక నుంచి పొడి చెత్తపై టెండర్ ప్రక్రియను చేపడుతాం.

మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్

ఎస్‌జీఎఫ్ క్రీడా సంబురం

- నేటి నుంచి పటాన్‌చెరులో ప్రారంభం
- మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు
- తరలిరానున్న 33 జిల్లాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు



మైత్రి మైదానాన్ని పరిశీలిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు పటాన్‌చెరు మైత్రి మైదానం వేదికగా నిలవబోతోంది. గురువారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులతో క్రీడా పోటీల తోపాటు, క్రీడాకారులకు ఉచిత వసతి, భోజనం, ట్రోఫీలు, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. 33 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు, 60 మంది శిక్షకులు, 160 మంది వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా సంబరాల్లో పాల్గొనబోతున్నారు. వాలీబాల్, కబడ్డీ పోటీలు జరగనున్నాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్న సమున్నత లక్ష్యంతో మొదటిసారి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు పటాన్‌చెరును వేదికగా నిలపడం జరిగింది. త్వరలో మహిళల కబడ్డీ జాతీయ పోటీలకు పటాన్‌చెరు వేదికగా నిలవబోతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి క్రీడాకారుడిని రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

- తల్లి హత్య కేసు..

కొడుకు సహా మరొకరికి జీవిత ఖైదు

- రూ.22 వేలు జరిమాన
- వివరాలు వెల్లడించిన సిద్దిపేట సీపీ

ములుగు(గజ్వేల్): కన్న తల్లిని మరొకరితో కలసి హత్య చేసిన ఘటనలో కొడుకుతో పాటు మరో వ్యక్తికి జీవిత ఖైదు, రూ.22 వేల జరిమాన విధిస్తూ కోర్టు తీర్పు వెలువరిచింది. ములుగు మండలం బండమైలారంలో రెండేళ్ల క్రితం ఈ ఘటన చోసుకుంది. ఈ కేసు వివరాలను సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎస్.ఎం విజయ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. బండమైలారంలో మిరియాల వెంకటమ్మను 2023, ఆగస్టు 24న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడ, రెండు కాళ్లు నరికి హత్య చేసి, కడియాలను దొంగిలించుకు పోయారు. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ సీఐ జానకిరామ్ రెడ్డి దర్యాప్తు చేపట్టి మృతురాలి కొడుకు మిరియాల ఈశ్వర్, అతని స్నేహితుడు పర్వతం రాములను నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. తదుపరి పరిశోధనలో టెక్నికల్ రిపోర్ట్ వచ్చిన తర్వాత కేసు కోర్టులో చార్జిషీట్ వేశారు. వాదనలు విన్న ఒకటవ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి జయప్రసాద్ బుధవారం తుది తీర్పును వెలువరిస్తూ.. నిందితులు ఈశ్వర్, రాములకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.22 వేలు జరిమాన విధించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

- మహిళ కడుపులో 4.1 కిలోల గడ్డ తొలగింపు
- దుబ్బాక ఆస్పత్రి వైద్యుల ఘనత


ఆపరేషన్ చేసిన దుబ్బాక ఆస్పత్రి వైద్యబృందం

దుబ్బాక: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్ చేశారు. బుధవారం సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో వైద్యులు ఓ మహిళకు కడుపులో నుంచి 4.1 కిలోల ఓవరియాస్ మాస్‌గడ్డను తొలగించారు. వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందెడ్‌కు చెందిన జయ(30) ఏడాది కాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. నాందెడ్‌లో ఎన్నో ఆస్పత్రులు తిరిగినా తగ్గడం లేదు. బంధువుల సమాచారం మేరకు మూడు రోజుల క్రితం దుబ్బాక ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. అయితే కడుపులో 15 సెంటీమీటర్ల ఓవరియాస్ మాస్ గడ్డ ఉందని గుర్తించారు. ఈ క్రమంలో బుధవారం ఆయుష్మాన్‌భారత్ పథకం కింద ఆమెకు ఆపరేషన్ చేసి కడుపులోంచి గడ్డను తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని హేమరాజ్‌సింగ్ తెలిపారు. కాగా, ఆపరేషన్ చేసి జయ ప్రాణాలు కాపాడిన వైద్యులకు ఆమె బంధువులు అభినందనలు తెలిపారు.

ఇల్లు లేని బతుకు ఇంకెందుకు..?

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


ప్రవీణ్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): తనకు ఇల్లు లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చేగుంట మండలం పొలంపల్లిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల ప్రవీణ్ (30)కు సొంత ఇల్లు లేకపోవడంతో గ్రామంలోని ఓ కమ్యూనిటీ భవనంలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఇందిరమ్మ ఇల్లు సైతం మంజూరు కాలేదు. ఇంటి విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఇల్లు లేని బతుకు ఇక ఎందుకు అని వాపోయేవాడు. ఈ క్రమంలో ప్రవీణ్ సోమవారం బయటకు వెళుతున్నట్లు చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. ప్రవీణ్ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, బుధవారం స్థానిక చెరువులో ప్రవీణ్ మృతదేహం తేలింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరి బలవన్మరణం

వేర్వేరు ప్రాంతాల్లో ఘటన


మున్నా

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండల పరిధిలో వేర్వేరు కారణాలతో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సదాశివనగర్ తండాకు చెందిన లంబాడి మున్నా (35) వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. తెల్లవారుజామున అతని భార్య లేచి చూడగా, ఇంట్లో ఉరేసుకొని విగత జీవిగా కనిపించాడు. దీంతో భయాందోళన చెందిన ఆమె విలపిస్తూ ఈ విషయమై తండా వాసులకు సమాచారం అందించింది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్ కాలనీలో ..


బాలకృష్ణ

మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన ఎర్రం బాలకృష్ణ (38) స్థానిక డబుల్ బెడ్‌రూం కాలనీ (కేసీఆర్ కాలనీ)లో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న బాలకృష్ణ రాత్రి తన వ్యవసాయ బోరు వద్ద క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీని ఢీకొట్టిన కారు..

వివాహిత మృతి.. మరొకరికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రేషన్ బియ్యం కోసం స్కూటీపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో వివాహిత మృతి చెందింది. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తిమ్మారెడ్డిపల్లి కాశతుర్క కాలనీ నుంచి మామ గోరెమియా, కోడలు అసిఫా(26) రేషన్ దుకాణానికి వెళ్తున్నారు. ఈక్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు ఎగిరి పడ్డారు. దీంతో అసిఫా తలకు బలమైన గాయాలు కాగా, గోరెమియాకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అసిఫా మృతి చెందింది. కారు డ్రైవరు కరీంనగర్ జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన కొడూరి సంపత్, హైదరాబాద్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఎన్నికల అధికారులం అంటూ తనిఖీ

దంపతుల నుంచి 6 తులాల నగలు తస్కరణ


బాధిత దంపతులు కిషన్, మాణెమ్మ

పాపన్నపేట(మెదక్): ఎన్నికల అధికారులమంటూ నమ్మబలికి దంపతుల వద్ద నుంచి 6 తులాల బంగారం తస్కరించారు. ఈ సంఘటన పాపన్నపేట మండలం కొత్తపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లికి చెందిన ఏడుపాయల మాజీ డైరెక్టర్ బూచనెల్లి కిషన్, మాణెమ్మ దంపతులు ఎల్లుపేటలో బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యక్రమానికి స్కూటీపై బయలుదేరారు. ఈ క్రమంలో కొత్తపల్లి అనంతుని వాగు వంతెన వద్దకు రాగానే.. ఇద్దరు అగంతుకులు తాము ఎన్నికల అధికారులమంటూ వీరి వాహనాన్ని ఆపారు. తమ వద్ద నగదు లేదని వారు చెప్పగా, మాణెమ్మ మెడలో ఉన్న బంగారాన్ని చూపిస్తూ.. జాగ్రత్తమ్మా దానిని స్కూటీ డిక్కీలో వేసుకోవాలంటూ ఉచిత సలహా ఇచ్చారు. దీంతో ఆమె పుస్తెల తాడు, గుండ్లు తీసి దస్తీలో కట్టి, డిక్కీలో వేసింది. వెంటనే అగంతకులు మరోసారి చెక్ చేద్దామంటూ.. డిక్కీలో చేయి పెట్టి, మాటలతో ఏమార్చి నగలు తస్కరించారు. అగంతకులు వెళ్లి పోగానే అనుమానం వచ్చిన దంపతులు, డిక్కీలో బంగారు ఆభరణాల కోసం వెతకగా..అవి కనిపించ లేవు. దీంతో మోసపోయినట్లు గ్రహించి పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. వీటి విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మంజీరాలో ఎముకల గూడు లభ్యం

గల్లంతైన 50 రోజులకు ఆచూకి


ప్రమీల

కొల్చారం(నర్సాపూర్): యాభై రోజుల క్రితం మంజీరాలో గల్లంతైన మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్‌కు చెందిన టేక్మాల్ ప్రమీల (58) ఆచూకీ లభ్యమైంది. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ మహ్మద్ మోహినొద్దీన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రమీల ఆగస్టు 26వ తేదీన కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని మంజీరా వద్దకు వెళ్లింది. ఇదే సమయంలో ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో నదిలో గల్లంతైంది. నాటి నుంచి వరద ప్రవాహం తగ్గకపోవడంతో ఆచూకీ తెలియకుండా పోయింది. నాలుగు రోజులుగా ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఇదే సమయంలో చిన్నఘనాపూర్ శివారులోని మంజీరాలో ఎముకల గూడుతో ఉన్న మహిళ మృతదేహం కనిపించడంతో అటువైపుగా వెళ్లిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్‌ఐ ఎముకల గూడుపై ఉన్న చీర ఆధారంగా ప్రమీలగా గుర్తించారు. మృతురాలి కుమారుడు వీరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేపర్ బాయ్ ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లికి చెందిన చీర్ల కిష్టయ్య–నాగమణి దంపతులకు నలుగురు కూతుర్లు, కొడుకు రాజేష్(16) ఉన్నారు. కిష్టయ్య దంపతులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుండగా, రాజేష్ 10వ తరగతి చదువుతూ ఉదయం సమయంలో పేపర్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం కిష్టయ్య దంపతులు గండిమైసమ్మలోని తమ కూతురు ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి రాజేష్‌తో కలిసి వెళ్లారు. తిరిగి సోమవారం న్యూస్‌పేపర్ వేసేది ఉందని తన తల్లి నాగమణిని సైతం సంగుపల్లికి రావాలని కోరగా.. మర్నాడు వస్తానని చెప్పడంతో మానసిక వేదనకు గురైన రాజేష్ ఒక్కడే ఇంటికి చేరుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం రాజేష్‌కు అతని స్నేహితులు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. దీంతో ఇంటికి వెళ్లి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మళ్లీ తెరపైకి!

- బడుల తనిఖీలకు టీచర్లు
- పాఠశాలల వారీగా కమిటీలు
- గతంలో వెనక్కి తగ్గిన విద్యాశాఖ

సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యను అందించి.. విద్యార్థుల్లో స్థాయికి తగ్గ సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా టీచర్లతో మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత జూన్‌లోనే ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, అప్పట్లో టీచర్లు వ్యతిరేకించడంతో అమలును నిలిపివేశారు. తిరిగి కొన్ని మార్పులతో టీచర్ కమిటీలు ఏర్పాటు చేయాల్సిందిగా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. కాగా జిల్లాలో డీఈఓ రాధాకిషన్ సారథ్యంలో ఇప్పటికే వేసిన జిల్లాస్థాయి కమిటీ రోజు వారీ తనిఖీలు జరుపుతోంది.

– మెదక్ అర్బన్

ప్రతి వంద ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒక కమిటీ, 50 ఉన్నత పాఠశాలలకు మరో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలు ప్రతి మూడు నెలలకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసి, ప్రతి వారం డీఈఓలకు నివేదిక అందజేయాలి. ప్రాథమిక పాఠశాలకు ప్రైమరీ హెచ్‌ఎం, ప్రాథమికోన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్ నోడల్ అధికారిగా, ఇద్దరు సభ్యులు ఉంటారు. ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ హెచ్‌ఎం నోడల్ అధికారిగా, ఎనిమిది మంది సబ్జెక్ట్ టీచర్లు, పీఈటీలు సభ్యులుగా ఉంటారు. పర్యవేక్షణ కమిటీ కోసం ఎంపిక చేసిన టీచర్లు కనీసం పదేళ్ల బోధన అనుభవం కలిగి ఉండాలి.

జిల్లాలో ఇప్పటికే మొదలైన తనిఖీలు

కనీస సామర్థ్యాలే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ ఇప్పటికే జిల్లాలో ఒక తనిఖీ టీంను ఏర్పాటు చేశారు. ఇందులో ఏఎంఓ, సెక్టోరియల్ అధికారులు, ఆయా మండల ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సభ్యులుగా ఉన్నారు. ప్రతి రోజు ఒక మండలానికి వెళ్లిన టీం సభ్యులు, విడిపోయి ఒక్కొక్కరు ఒక పాఠశాలకు వెళ్తున్నారు. విధిగా ప్రార్థనలో ఉండి, మధ్యాహ్నం వరకు ఈఎల్‌ఎం అమలు తీరును పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలోని చతుర్విద ప్రక్రియలు వస్తున్నాయా..? లేదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు అభ్యాస దీపికల వినియోగాన్ని గమనిస్తున్నారు. టీచింగ్ డైరీ, పీరియడ్ ప్లాన్స్, టీఎల్‌ఎం వాడకం తీరును చూస్తున్నారు. అయితే ఎండ్‌లైన్.. బేస్‌లైన్ టెస్ట్‌లలో టీచర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని తెలుస్తుంది. పలుచోట్ల బేస్‌లైన్ టెస్ట్‌లను మూల్యాంకనం చేయడం లేదని సమాచారం. ఎండ్‌లైన్‌లో 40 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు, బేస్‌లైన్‌లో 6 శాతం చూపడం దీనికి నిదర్శనంగా భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని మూడు మండలాల్లో జిల్లా టీంలు తనిఖీలు నిర్వహించారు.


చేగుంట మండలం కరీంనగర్ స్కూల్‌లో తనిఖీ

త్వరలో కమిటీల ఏర్పాటు



పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం త్వరలో టీచర్ల కమిటీలను ఏర్పాటు చేస్తాం. అయితే కలెక్టర్, అదనపు కలెక్టర్ సూచనలతో ఇప్పటికే జిల్లాస్థాయి బృందాలతో తనిఖీలు కొనసాగిస్తున్నాం. మూడు మండలాల్లోని పాఠశాలలను పరిశీలించాం. మేము గమనించిన లోటు పాట్లను, సంబంధిత ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వివరిస్తున్నాం. నిర్లక్ష్యం కనిపించిన చోట క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

– రాధాకిషన్, డీఈఓ

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

మరో ఇద్దరికీ గాయాలు


శర్మన్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని అమీర్యాతండాకు చెందిన కేతావత్ శర్మన్ (55), సోమక్కపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డుల గూడెంకు చెందిన బత్తుల శ్రీను ఇద్దరు కలిసి బైక్‌పై శీలాంపల్లి నుంచి, సోమక్కపేట్‌కు వస్తున్నారు. సోమక్కపేట్ గ్రామానికి చెందిన పెద్ది బందెల్లి గ్రామం నుండి, శీలాంపల్లి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో శీలాంపల్లి గ్రామం శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో శర్మన్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీను, బందెల్లిలకు గాయాలయ్యాయి. కాగా మృతదేహంతో పాటు, గాయాలైన వారిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.